# సాక్షి
# పశ్చిమగోదావరి

శనివారం ౹ 28 ౹ జూన్ ౹ 2025




**జల విద్యుత్ కేంద్ర పనుల పరిశీలన**

పోలవరం ప్రాజెక్ట్ పూర్తయ్యే సమయానికి జల విద్యుత్ కేంద్రాన్ని కూడా సిద్ధం చేయాలని ఏపీ జెన్‌కో డైరెక్టర్ (హైడల్) ఎం.సుజయ్‌కుమార్ అన్నారు. 8లో ▸



**అచ్చియ్యపాలెంలో విషాదఛాయలు**

బుట్టాయగూడెం మండలం అచ్చియ్యపాలెంలో ఈతకు వెళ్లి ముగ్గురు యువకులు మృత్యువాత పడటంలో విషాద ఛాయలు అలముకున్నాయి. 8లో ▸

**డీఈడీ ప్రవేశ పరీక్షలో ప్రతిభ**



భీమవరం: భీమవరానికి చెందిన సంగడి ఏదిత హాసిని డీఈడీ (టీచర్స్ ట్రైనింగ్) కోర్సు ప్రవేశ పరీక్షలో రాష్ట్ర స్థాయిలో ఏడో ర్యాంక్ సాధించింది. ఆమె తండ్రి శ్రీకృష్ణ మావుళ్లయ్య ప్రభుత్వ ఉపాధ్యాయుడిగా పనిచేస్తున్నారు. 8లో

## న్యూస్‌రీల్

### రిజిస్ట్రార్ కార్యాలయానికి 'దారి' చూపారు



ఉండి రిజిస్ట్రార్ కార్యాలయం ఎదుట మెటల్ వేసిన దృశ్యం

సాక్షి స్పందన

ఉండి: 'నీరు నిలిస్తే దారి గల్లంతే' శీర్షికను ఈనెల 26న 'సాక్షి'లో ప్రచురించిన కథనానికి అధికారులు స్పందించారు. ఉండిలోని సబ్ రిజిస్ట్రార్ కార్యాలయం దారి బురదతో నిండి ఉండటంతో చర్యలు తీసుకున్నారు. కార్యాలయ ముఖ ద్వారంతో పాటు కార్యాలయం చుట్టూ మెటల్ (చిప్స్) వేసి మరమ్మతులు చేపట్టారు. సమస్య పరిష్కారానికి కృషి చేసిన 'సాక్షి'కి పలువురు కృతజ్ఞతలు తెలిపారు.

### కాల్ సెంటర్ అర్జీలపై ప్రత్యేక దృష్టి



మాట్లాడుతున్న జేసీ రాహుల్‌కుమార్‌రెడ్డి

భీమవరం (ప్రకాశం చౌక్): సమస్యల పరిష్కారం కోసం ఏర్పాటుచేసిన 1100 కాల్ సెంటర్‌కు అందిన అర్జీల పరిష్కారంపై తక్షణ చర్యలు తీసుకోవాలని జేసీ టి.రాహుల్‌కుమార్‌రెడ్డి ఆదేశించారు. శుక్రవారం కలెక్టరేట్‌లో కాల్ సెంటర్ అర్జీల పురోగతిపై అధికారులతో సమీక్షించారు. ఈ సందర్భంగా జేసీ మాట్లాడుతూ అర్జీలను నిర్ణీత గడువులోపు క్షేత్రస్థాయిలో విచారణ చేసి పరిష్కరించాలన్నారు. అలాగే పీజీఆర్ఎస్ ద్వారా వచ్చిన ఫిర్యాదుల పరిష్కారంలో కొన్ని శాఖల అధికారులు నిర్లక్ష్య వైఖరి కనిపిస్తోందని, చర్యలు తప్పవని హెచ్చరించారు. డీఆర్వో మొగిలి వెంకటేశ్వర్లు, డ్వామా పీడీ కేసీహెచ్ అప్పారావు, డీపీఓ రామ్‌నాథ్‌రెడ్డి, డీఎంహెచ్ఓ గీతాబాయి తదితరులు పాల్గొన్నారు.

### విద్యుత్ మీటర్ రీడర్ల సమస్యలు పరిష్కరించాలి



మాట్లాడుతున్న ఏఐటీయూసీ జిల్లా అధ్యక్షుడు శ్రీనివాస డాంగే

ఏలూరు (టూటౌన్): విద్యుత్ మీటర్ రీడర్ల సమస్యలను పరిష్కరించాలని ఏఐటీయూసీ జిల్లా అధ్యక్షుడు రెడ్డి శ్రీనివాస్ డాంగే డిమాండ్ చేశారు. శుక్రవారం ఏపీ విద్యుత్ మీటర్ రీడర్స్ యూనియన్ ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లా సమావేశాన్ని ఏలూరులో యూనియన్ జిల్లా కోశాధికారి మల్లేశ్వరరావు అధ్యక్షతన నిర్వహించారు. జిల్లా గౌరవ అధ్యక్షుడు, ఏఐటీయూసీ జిల్లా అధ్యక్షుడు రెడ్డి శ్రీనివాస్ డాంగే, జిల్లా నాయకులు పి.కిషోర్ మాట్లాడుతూ ఎస్క్రో అకౌంట్‌ను తక్షణమే ఓపెన్ చేయాలని, మీటర్ రీడర్లకు ప్రత్యామ్నాయ ఉపాధి చూపాలని డిమాండ్ చేశారు. రాష్ట్ర అధ్యక్షుడు ఎల్.రామకృష్ణ, జిల్లా ఉపాధ్యక్షుడు పి.జాకబ్ మాట్లాడుతూ మీటర్ రీడర్లు కాంట్రాక్టర్లు, విద్యుత్ శాఖ అధికారులతో పలు సమస్యలు ఎదుర్కొంటున్నారన్నారు. జిల్లా సహాయ కార్యదర్శులు ఎ.దుర్గారావు, స్వామి, శంకర్ అప్పారావు, జిల్లా ఆర్గనైజింగ్ సెక్రటరీ శేఖర్ నాగేశ్వరావు తదితరులు పాల్గొన్నారు.

### గ్రీన్‌ఫీల్డ్ పనులను అడ్డుకున్న రైతులు



పుట్లగట్లగూడెం రాస్తారోకో చేస్తున్న రైతులు

జంగారెడ్డిగూడెం: గ్రీన్‌ఫీల్డ్ హైవే నిర్మాణంలో పొలాలకు వెళ్లేందుకు దారి ఏర్పాటు చేయకపోవడంతో ఇబ్బంది పడుతున్నామంటూ రైతులు ఆవేదన వ్యక్తం చేశారు. శుక్రవారం మండలంలోని పుట్లగట్లగూడెం గ్రీన్‌ఫీల్డ్ హైవే వద్ద రైతులు రాస్తారోకో చేసి పనులను అడ్డుకున్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ హైవే సర్వీస్ రోడ్డు పక్క నుంచి పొలాలకు వెళ్లే దారి ఇస్తామని చెప్పి, ఇవ్వకుండా సర్వీసు రోడ్డు నిర్మాణం చేపట్టారన్నారు. అలాగే హైవే పక్కనే ఉన్న కొంగల చెరువు సర్‌ప్లస్ వాటర్ దిగువ ప్రాంతాలకు వెళ్లే మురుగు కాలువను పూడ్చడంతో వరద ముంపు నీరు పొలాలను ముంచెత్తుతోందన్నారు.

# మత్స్య విద్య ఎదురీత

- నరసాపురంలోని ఏపీ ఫిషరీస్ యూనివర్సిటీకి నిర్లక్ష్యపు గ్రహణం
- కూటమి నిర్వాకం వల్ల ఏడాదిగా నిలిచిన వర్సిటీ నిర్మాణం
- రెండేళ్లుగా తాత్కాలిక భవనంలోనే కళాశాల నిర్వహణ
- సెకండ్ బ్యాచ్‌కు గదుల్లేక ఆర్‌బీకేలో తరగతులు
- హాస్టల్ వసతి లేక విద్యార్థుల ఇక్కట్లు

**ఆర్‌బీకేనే తరగతి..!**



రైతు భరోసా కేంద్రం (ఆర్‌బీకే) నుంచి వస్తున్న వీరంతా రైతులు కాదు. ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లాలో నరసాపురం కేంద్రంగా గత ప్రభుత్వం ఏర్పాటుచేసిన ఏపీ ఫిషరీస్ యూనివర్సిటీ విద్యార్థులు వీరు. ప్రస్తుత కూటమి ప్రభుత్వ నిర్లక్ష్యంతో ఏడాది కాలంగా యూనివర్సిటీ నిర్మాణ పనులు నిలిచిపోవడంతో కళాశాల నిర్వహిస్తున్న తాత్కాలిక భవనంలో సెకండ్ బ్యాచ్ విద్యార్థులకు గదుల్లేవు. ఫలితంగా పక్కనే ఉన్న ఆర్‌బీకే భవనంలోని చాలీచాలని హాల్లోనే వీరికి తరగతులు నిర్వహించారు.



కూటమి నిర్లక్ష్యం.. నరసాపురంలో శ్లాబ్ దశలో నిలిచిన ఫిషరీస్ యూనివర్సిటీ భవన నిర్మాణాలు

సాక్షి, భీమవరం: ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లాలోని నరసాపురంలో ఏర్పాటు చేసిన ఫిషరీస్ యూనివర్సిటీ వసతుల్లేక సతమతమవుతోంది. మత్స్య విద్య ఏటికేడు ఎదురీదుతోంది. దీనికి కూటమి ప్రభుత్వ నిర్లక్ష్యమే కారణం. గత ప్రభుత్వ హయాంలో అప్పటి ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి ఏపీ ఫిషరీస్ యూనివర్సిటీని మంజూరు చేశారు. రాష్ట్రంలో ఇది రెండో ఫిషరీస్ యూనివర్సిటీ. యూనివర్సిటీ క్యాంపస్ కోసం నరసాపురం పక్కనే 40 ఎకరాల స్థలాన్ని గత ప్రభుత్వం కేటాయించింది. అడ్మినిస్ట్రేటివ్ బ్లాక్, కాలేజీ, బాయ్స్, గరల్స్ హాస్టల్ భవనాల కోసం రూ.100 కోట్లు మంజూరు చేసింది.

**రెండేళ్లుగా తాత్కాలిక భవనంలోనే..**

తొలుత ఏడాది కాలానికి నరసాపురంలోని తుపాను షెల్టర్ భవనంలో తాత్కాలికంగా 66 సీట్లతో 2023 జూన్‌లో నాలుగేళ్ల కాలపరిమితి కలిగిన బ్యాచిలర్ ఆఫ్ ఫిషరీస్ సైన్స్ కోర్సును ప్రారంభించారు. 2024 నాటికి క్యాంపస్‌లో తరగతులు నిర్వహించాలన్న లక్ష్యంతో శరవేగంగా నిర్మాణ పనులు చేపట్టారు. గత ఏడాది మార్చి నాటికే అడ్మినిస్ట్రేటివ్ బ్లాక్, కళాశాల భవనాలు శ్లాబ్ దశకు చేరుకోగా, బాయ్స్, గరల్స్ హాస్టల్ భవనాల పునాదులు పూర్తయ్యాయి. దాదాపు రూ.35 కోట్ల విలువైన పనులు గత ప్రభుత్వ హయాంలోనే జరగగా.. కూటమి ప్రభుత్వం వచ్చాక నిర్మాణాలను అటకెక్కించింది. నిధులివ్వకపోవడంతో పనులు ముందుకు సాగడం లేదు. ఫలితంగా రెండేళ్ల నుంచి తాత్కాలిక భవనంలోనే తరగతులను నిర్వహించాల్సిన దుస్థితి నెలకొంది. ఇక్కడ వసతులు లేక విద్యార్థులు ఇబ్బందులు పడుతున్నారు.

**ఆర్‌బీకే భవనంలో సెకండ్ బ్యాచ్**

ప్రస్తుత తాత్కాలిక భవనంలోని 12 గదులు 66 మంది స్టూడెంట్స్ కలిగిన ఒక బ్యాచ్‌కు మాత్రమే తరగతులు, ల్యాబ్ నిర్వహణకు సరిపోతున్నాయి. 2024 జూలై నుంచి మరో 66 మందితో సెకండ్ బ్యాచ్ మొదలు కావడంతో పక్కనే ఉన్న ఆర్‌బీకే భవనంలోని హాల్‌ను తరగతి గదిగా, స్టాఫ్ రూమ్‌ను కంప్యూటర్ ల్యాబ్‌గా వినియోగిస్తుండటం గమనార్హం.

**ప్రైవేటు మెస్‌లు, అద్దె గదులే గతి!**

క్యాంపస్ హాస్టల్ లేక రాష్ట్రంలోని వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన విద్యార్థులు ప్రైవేటు మెస్‌లు, అద్దె గదులను ఆశ్రయించాల్సి వస్తోంది. గదులను బట్టి ఒక్కో విద్యార్థికి నెలకు రూ.5 వేల నుంచి రూ.7 వేల వరకు ఖర్చవుతోంది. విద్యార్థినులు భద్రతాపరంగా ఆందోళన చెందుతున్నారు. కళాశాలకు వచ్చే వెళ్లే దారిలో ఆకతాయిల బెడద ఎక్కువగా ఉంటోందని చెబుతున్నారు. కళాశాల వద్ద క్రీడా మైదానం కూడా లేకపోవడంతో విద్యార్థులు ఆవేదన చెందుతున్నారు.

**సెక్యూరిటీ లేదు**



క్యాంపస్ హాస్టల్ సదుపాయం లేక బయట అద్దె గదుల్లో ఉండాల్సి వస్తోంది. భద్రతాపరంగా తీవ్ర ఇబ్బందులు పడుతున్నాం. ఆకతాయిల బెడద ఉంటోంది.

– సి.ధరణి, కర్నూలు, ద్వితీయ సంవత్సరం విద్యార్థిని

**చాలా ఇబ్బంది పడుతున్నాం**



క్యాంపస్ సదుపాయం లేకపోవడంతో చాలా ఇబ్బందిగా ఉంటోంది. హాస్టల్ నిమిత్తం నెలకు రూ.7 వేల వరకు ఖర్చవుతున్నాయి. కాలేజీకి కిలోమీటరు పైగా నడవాల్సి వస్తోంది.

– వి.రాకేష్, ఒంగోలు, మొదటి సంవత్సరం విద్యార్థి

**హాస్టల్ వసతి కల్పించాలి**



ఎక్కడెక్కడి నుంచో వచ్చి ఇక్కడ చదువుకుంటున్నాం. క్యాంపస్ హాస్టల్ ఉంటే బాగుంటుంది. యూనివర్సిటీ భవనాలు వేగంగా పూర్తిచేయాలి. క్రీడా మైదానం, ల్యాబ్ వసతులు కల్పించాలి.

– దేవీ ప్రసాద్‌దొర, పార్వతీపురం, మొదటి సంవత్సరం విద్యార్థి

**కొత్త బ్యాచ్ పరిస్థితి ఏమిటి?**

సెకండ్ ఇయర్, థర్డ్ ఇయర్ విద్యార్థులు 132 మంది ఉండగా, ప్రస్తుత విద్యా సంవత్సరానికి జూలై నుంచి 66 మందితో ఫస్ట్ ఇయర్ సీట్ల భర్తీ జరగనుంది. కొత్త బ్యాచ్‌కు అక్టోబరులో తరగతులు ప్రారంభమవుతాయి. ఈ నేపథ్యంలో వీరికి క్లాసులు ఎక్కడ నిర్వహిస్తారన్నది ప్రశ్నార్థకంగా మారింది. స్థానికంగా ప్రైవేట్ విద్యాసంస్థలో తరగతుల నిర్వహణకు యత్నాలు జరుగుతున్నట్టు కళాశాల వర్గాలు చెబుతున్నాయి.

### కాలువలోకి దూసుకెళ్లిన టూరిస్టు బస్సు

**చాకచక్యంగా వ్యవహరించిన డ్రైవర్**



పెదకాకాని సమీపంలో వంతెన పైకి ఎక్కి ఆగిన బస్సు

పెదకాకాని: ప్రయాణికులతో వస్తున్న బస్సు కాలువలోకి దూసుకెళ్లింది. ప్రమాదం తృటిలో తప్పింది. తణుకు నుంచి అరుణాచలం తీర్థయాత్రకు 39 మంది ప్రయాణికులతో టూరిస్టు బస్సు బయలుదేరింది. వారు శుక్రవారం రాత్రి గుంటూరు జిల్లా పెదకాకాని శివాలయంలో నిద్ర చేసి ఉదయం బయలుదేరాలని నిర్ణయించుకోవడం డ్రైవర్ సర్వీసు రోడ్డులో బస్సును నడుపుతున్నాడు. వారు పెదకాకాని మండలం నంబూరు అరబిక్ స్కూల్ సమీపంలోకి చేరుకునే సరికి బస్సు నడుపుతున్న డ్రైవర్ ఒక్కసారిగా అస్వస్థతకు గురయ్యాడు. బస్సు అదుపుతప్పి జాతీయ రహదారి పక్కనే ఉన్న కల్వర్టు వంతెనపైకి ఎక్కి ఆగింది. బస్సులో ప్రయాణిస్తున్న వారంతా భయంతో కేకలు వేశారు. పలువురి స్వల్ప గాయాలయ్యాయి. సంఘటనా స్థలానికి పోలీసులు చేరుకుని విచారణ చేపట్టారు.

# అక్రమ కేసులకు భయపడే ప్రసక్తే లేదు

- హామీలతో ఊదరగొట్టి.. అధికారంలోకొచ్చాక గాలికొదిలేశారు
- ఏడాదిలోనే కూటమి సర్కార్ ప్రజావిశ్వాసం కోల్పోయింది
- కార్యకర్తలు అధైర్య పడొద్దు.. రానున్న రోజులు మనవే
- వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షుడు ముదునూరి





కార్యకర్తల సమావేశంలో మాట్లాడుతున్న వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షుడు ముదునూరి ప్రసాదరాజు, సమావేశానికి హాజరైన పార్టీ శ్రేణులు

నరసాపురం: కూటమి ప్రభుత్వ అక్రమ కేసులకు భయపడే ప్రసక్తి లేదని, పార్టీ నాయకులు, కార్యకర్తలకు అండగా ఉంటామని వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షుడు ముదునూరి ప్రసాదరాజు అన్నారు. పట్టణంలోని పార్టీ కార్యాలయం వద్ద శుక్రవారం నరసాపురం మండల కార్యకర్తల విస్తృతస్థాయి సమావేశాన్ని మండల అధ్యక్షుడు ఉంగరాల రమేష్‌నాయుడు అధ్యక్షతన నిర్వహించారు. ముఖ్య అతిథిగా ముదునూరి మాట్లాడుతూ కార్యకర్తల త్యాగాలను పార్టీ అధినేత వైఎస్ జగన్ మరిచిపోలేదన్నారు. కార్యకర్తలు ఏమాత్రం అధైర్య పడొద్దని, ప్రజా సమస్యలపై పోరాడాలని పిలుపునిచ్చారు. మోసపూరిత హామీలతో గద్దెనెక్కిన కూటమి పాలన ఏడాదిలోనే ప్రజావిశ్వాసాన్ని కోల్పోయిందన్నారు. గత ప్రభుత్వంలో స్వర్ణయుగాన్ని చూసి ప్రజలు నేడు పలు అవస్థలు పడుతున్నారన్నారు. విద్యార్థులు, మహిళలు, కార్మికులు, ఉద్యోగులు, యువత, రైతులు ఇలా అన్ని వర్గాలూ జగన్‌ని ఎందుకు ఓడించమనే ఆలోచనలో పడ్డాయన్నారు.

**హామీలపై నోరు మెదపరే?**

ఎన్నికల సమయంలో చంద్రబాబు, పవన్ కల్యాణ్‌లు మాజీ సీఎం జగన్ కంటే ఎక్కువ పథకాలు ఇస్తామని ప్రజలను నమ్మించి మోసం చేశారని ముదునూరి మండిపడ్డారు. రైతు భరోసా రూ.20 వేలు, మహిళలకు ఉచిత బస్సు, ఎస్సీ, ఎస్టీ, బీసీ మహిళలకు 50 ఏళ్లకే పింఛన్, 18 ఏళ్లు నిండిన ప్రతి మహిళకు నెలకు రూ.1,500 వంటి ఎన్నో హామీలు ఇచ్చి ఇప్పుడు మొఖం చాటేశారని దుయ్యబట్టారు. గత ప్రభుత్వంలో రాష్ట్రంలో 68 లక్షల మందికి పింఛన్లు ఇస్తే ఇప్పుడు 60 లక్షల మందికే పరిమితం చేశారన్నారు. అలాగే ఏడాదిలోనే ప్రజలపై రూ.16 వేల కోట్లు విద్యుత్ భారాలను మోపారన్నారు. సూపర్‌సిక్స్ హామీలను గాలికి వదిలేశారన్నారు. కూటమి మోసాలను ప్రజలకు వివరించే బృహత్తర బాధ్యత వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలపై ఉందన్నారు.

**ప్రాజెక్టులను పట్టించుకోరా..**

నరసాపురం నియోజకవర్గంలో రూ.650 కోట్లతో వశిష్ట వంతెన, రూ.400 కోట్లతో ఆక్వా యూనివర్సిటీ, బియ్యపుతిప్ప ఫిషింగ్ హార్బర్ వంటి ప్రాజెక్టులను గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో తీసుకువస్తే కూటమి నాయకులు ఇప్పుడు ఎందుకు పట్టించుకోవడంలేదని ముదునూరి ప్రశ్నించారు. పక్కా జీఓలతో, నిధులు మంజూరు చేయించిన ప్రాజెక్టులు పూర్తి చేసి ఆ ఘనతను కూటమి నాయకులే పొందచ్చు కదా అని అన్నారు. మున్సిపల్ చైర్‌పర్సన్ బర్రి శ్రీవెంకటరమణ, ఎంబీసీ కార్పొరేషన్ మాజీ చైర్మన్ పెండ్ర వీరన్న మాట్లాడుతూ జగన్ ఆందోళనలు తర్వాతే కూటమి ప్రభుత్వం తల్లికి వందనం పథకం అమలు చేసిందన్నారు. పార్టీ అగ్నికుల క్షత్రియ విభాగ రాష్ట్ర అధ్యక్షుడు తిరుమాని నాగరాజు, పార్టీ కేంద్ర పాలక మండలి సభ్యుడు పీడీ రాజు, జెడ్పీటీసీలు బొక్కా రాధాకృష్ణ, తిరుమాని బాబ్జి, స్టేట్ మైనార్టీ సెల్ అఫీషియల్ స్పోక్స్ పర్సన్ షేక్ బులిమస్తాన్, సోషల్ మీడియా జిల్లా కన్వీనర్ బందన పూర్ణ, నరసాపురం ఎంపీపీ మైలాబత్తుల సోనీ, రైతు విభాగం రాష్ట్ర కార్యదర్శి పోలిశెట్టి గోపీ, స్టేట్ పబ్లిసిటీ విభాగ కార్యదర్శి ఇంజేటి జాన్ కెన్నడీ మాట్లాడారు. ఈపార్టీ నేతలు వైకేఎస్, పప్పుల రామారావు, కొల్లాబత్తుల రవి, కడలి రాంబాబు, పలువురు కౌన్సిలర్లు, సర్పంచ్‌లు, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

# మున్సిపల్ కార్మికుల గోడు పట్టదా?

**బడుగులు.. కుదేలు**

- సమ్మెలోనే మున్సిపల్ ఇంజనీరింగ్ కార్మికులు
- ఆరు రోజులుగా దీక్షలు, నిరసనలు
- ఉద్యోగ భద్రత, వేతనాల పెంపునకు డిమాండ్
- సమస్యలను పట్టించుకోని కూటమి ప్రభుత్వం



భీమవరం మున్సిపల్ కార్యాలయం వద్ద దీక్షలు చేపట్టిన ఇంజనీరింగ్ కార్మికులు (ఫైల్)

భీమవరం(ప్రకాశం చౌక్): చాలిచాలనీ జీతంలో జీవనం కష్టం మారింది.. కుటుంబాలను పోషించుకోలేకపోతున్నాం.. అంటున్న మున్సిపల్ మున్సిపల్ ఇంజనీరింగ్ అవుట్ సోర్సింగ్ కార్మికుల ఆవేదనను కూటమి ప్రభుత్వం పట్టించుకోవడం లేదు. వీరి సమస్యల పరిష్కారానికి దయ చూపడం లేదు. పలు మార్గాల్లో నిరసనలు, ఆందోళనలు తెలిపిన కార్మికులకు గత్యంతరం లేక సమ్మెబాట పట్టారు. రాష్ట్రవ్యాప్తంగా జరుగుతున్న సమ్మెలో భాగంగా భీమవరం మున్సిపల్ ఇంజనీరింగ్ కార్మికులు దీక్షలు చేపట్టి నిరసన తెలుపుతున్నారు. భీమవరం మున్సిపల్ కార్యాలయం వద్ద ఆరు రోజులగా ఇంజనీరింగ్ విభాగంలోని ఎలక్ట్రికల్, ప్లంబింగ్, వాటర్ వర్క్స్ కార్మికులు సమ్మెలో పాల్గొంటున్నారు. పట్టణంలో రోడ్ల నిర్వహణ, తాగునీరు, విద్యుత్ సరఫరాలో వీరి సేవలు కీలకం. వీరంతా సమ్మెలో ఉండటంతో పట్టణ ప్రజలు ఇబ్బంది పడుతున్నారు.

**కూటమి ప్రభుత్వ వంచన**

తాము అధికారంలోకి వస్తే మున్సిపల్ ఇంజనీరింగ్ కార్మికులకు సంక్షేమ పథకాలు అమలు చేస్తామని మేనిఫెస్టోలో కూటమి నాయకులు ప్రకటించారు. తీరా అధికారంలోకి వచ్చిన తర్వాత అమలు చేసిన తల్లికి వందనం పథకం ఇంజనీరింగ్ కార్మికులు అందలేదు. భీమవరం మున్సిపాలిటిలో 65 మంది కార్మికులు పనిచేస్తున్నారు. వారంతా తల్లికి వందనం పథకానికి అర్హులైనా అమలు చేయలేదు.

**కార్మికులు.. అప్పులపాలు**

కార్మికులకు కటింగ్‌లు పోను వచ్చే వేతనాలు కుటుంబపోషణ, పిల్లల చదువులకు సరిపోకపోవడంతో వీరు అప్పులపాలవుతున్నారు. రోజురోజుకూ పెరుగుపోతున్న నిత్యావసర సరుకుల ధరలు, స్కూల్ ఫీజులు, ఇతర కుటుంబ ఖర్చుల భారంగా మారాయి.

**ప్రధాన డిమాండ్లు**

- కార్మికులకు టెక్నికల్ జీతం రూ.29,200, నాన్ టెక్నికల్ రూ.24,500 అమలు చేయాలి.
- కూటమి ప్రభుత్వం మేనిఫెస్టోలో పెట్టిన ప్రకారం సంక్షేమ పథకాలు ఇవ్వాలి.
- హెచ్ఆర్ పాలసీ పరిధిలోకి తీసుకురావాలి
- కార్మికులందరికీ మినిమం టైమ్ స్కేల్ వర్తింపజేయాలి
- అవుట్ సోర్సింగ్ పద్ధతిపై 20 ఏళ్ల నుంచి పని చేస్తున్న వారికి సర్వీసు బట్టి 6 శాతం ఇంక్రిమెంట్‌తో జీతం పెంచాలి.
- రిటైర్‌మెంట్ బెనిఫిట్స్ కింద కార్మికులకు రూ.10 లక్షలు, నెలకి పెన్షన్ రూ.10 వేలు ఇవ్వాలి.
- కారుణ్య నియామకాలు అమలుచేయాలి
- కార్మికులకు గ్రాట్యూటీ ఇవ్వాలి
- జాతీయ పండుగలు, క్యాజువల్ లీవ్‌లు, వారాంతపు సెలవులు అమలు చేయాలి.
- హెల్త్‌కార్డులు, ఏడాదికి 30 మెడికల్ లీవ్‌లు మంజూరు చేయాలి.
- రిటైర్మెంట్, చనిపోయినా, అనారోగ్యం పాలైతే వారి పిల్లలకు ఉద్యోగాలు ఇవ్వాలి.

**సమస్యలతో సతమతం**



మున్సిపల్ ఇంజనీరింగ్ కార్మికులు పలు సమస్యలతో సతమతమవుతున్నారు. వీటి పరిష్కారం కోసం ఆరు రోజులుగా సమ్మె కొనసాగుతోంది. కార్మికులంతా సమ్మెలోనే ఉన్నారు. రాష్ట్రంలో అన్ని యూనియన్‌లు జేఏసీ ఏర్పడి మద్దతుగా నిలుస్తున్నాయి. కూటమి ప్రభుత్వం ఎన్నికల ముందు ఇచ్చిన హామీ మేరకు సంక్షేమ పథకాలు అమలుచేయాలి. మా న్యాయమైన డిమాండ్లు నెరవేర్చాలి.

– పిట్టా రాజేష్ బాబు, రాష్ట్ర జేఏసీ కన్వీనర్, భీమవరం

**ఉద్యోగ భద్రత కల్పించాలి**



వాటర్ వర్క్స్ విభాగంలో 14 ఏళ్లగా పనిచేస్తున్నాను. ఉద్యోగ భద్రత, పనికి తగిన వేతనం లేదు. కొత్తగా చేరిన వారికీ పాతవారి ఒకే జీతం ఉండకూడదు. సర్వీసు అర్హత గుర్తించి ఉద్యోగాలు రెగ్యులరైజ్ చేసి ఉద్యోగ భద్రత కల్పించాలి. పేద, మధ్యతరగతికి చెందిన కార్మికుల కుటుంబాలు కష్టాలను దృష్టిలో పెట్టుకుని ప్రభుత్వం తక్షణమే మా సమస్యలను పరిష్కరించాలని కోరుతున్నాం.

– జడ్డు నాగభూషణం, వాటర్ వర్క్స్ కార్మికుడు, భీమవరం

**కుటుంబాన్ని పోషించలేకపోతున్నా..**



15 ఏళ్లుగా భీమవరం మున్సిపల్ ఇంజనీరింగ్ కార్మికుడిగా పనిచేస్తున్నా. నాకు రూ.15 వేలు జీతమైతే చేతికి రూ.13 వేలు వస్తుంది. దీంతో కుటుంబాన్ని పోషించలేకపోతున్నా. మా సర్వీసును బట్టి టెక్నికల్ వర్క్స్‌కు జీతం రూ.29,200 నాన్ టెక్నికల్ వర్క్స్‌కు జీతం రూ.24,500 ఉండాలి. సర్వీసుకు తగిన వేతనం, ఉద్యోగ భద్రత, అన్ని రకాల ప్రయోజనాలు కల్పించాలి.

– వి.మురళీ, ఇంజనీరింగ్ కార్మికుడు, భీమవరం

### పారిశుద్ధ్య నిర్వహణపై శ్రద్ధ



అధికారులతో సమీక్షిస్తున్న కలెక్టర్ నాగరాణి

భీమవరం (ప్రకాశంచౌక్): భీమవరంలో చేపట్టిన అభివృద్ధి పనులు పూర్తిచేసేలా ప్రత్యేక శ్రద్ధ చూపాలని కలెక్టర్ సీహెచ్ నాగరాణి ఆదేశించారు. శుక్రవారం క్యాంపు కార్యాలయం నుంచి భవ్య భీమవరం, పారిశుద్ధ్య నిర్వహణ, పార్కుల అభివృద్ధి, రోడ్ల ఆక్రమణల తొలగింపు తదితర అంశాలపై అధికారులతో సమీక్షించారు. భీమవరంలో దాతల సహకారంతో చేపట్టిన పనులు వేగంగా పూర్తిచేయాలన్నారు. మౌలిక సదుపాయాల కల్పనపై ఆరా తీశారు. అనుమతులు లేని హోర్డింగ్‌లు తొలగించాలని, వాహనాల పార్కింగ్ ప్రాంతాలు గుర్తించాలన్నారు. పారిశుద్ధ్య నిర్వహణలో నిర్లక్ష్యం వహిస్తే సహించమన్నారు. జిల్లాలో ప్లాస్టిక్ నిషేధాన్ని పక్కాగా అమలు చేయాలన్నారు. సూర్యఘర్ పథకంపై ప్రజలకు అవగాహన కల్పించాలన్నారు. జేసీ టి.రాహుల్ కుమార్‌రెడ్డి, ఆర్డీఓ కె.ప్రవీణ్‌కుమార్‌రెడ్డి, మున్సిపల్ కమిషనర్ కె.రామచంద్రా రెడ్డి, టౌన్ ప్లానింగ్ అధికారి పార్థసారథి, అధికారులు పాల్గొన్నారు.

### డీఎస్సీ పరీక్షలకు 84 శాతం హాజరు

భీమవరం: జిల్లాలోని మూడు కేంద్రాల్లో శుక్రవారం నిర్వహించిన డీఎస్సీ పరీక్షలకు 84 శాతం అభ్యర్థులు హాజరయ్యారని డీఈఓ ఈ.నారాయణ శుక్రవారం తెలిపారు. ఉదయం 360 మందికి 303 మంది, మధ్యాహ్నం 360 మందికి 305 మంది హాజరయ్యారన్నారు. ఎక్కడా మాల్‌ప్రాక్టీస్ కేసులు నమోదు కాలేదని చెప్పారు.

## క్లుప్తంగా

### షూటింగ్ పోటీల్లో బంగారు పతకాలు


షూటింగ్ పోటీల్లో బంగారు పతకాలు సాధించిన జై నృసింహ, పక్కన మాజీ ఎమ్మెల్యే మేకా వెంకట ప్రతాప్ అప్పారావు

**నూజివీడు:** నూజివీడు మాజీ ఎమ్మెల్యే మేకా వెంకట ప్రతాప్ అప్పారావు మనుమడు మేకా జై నృసింహ ప్రతాప్ అప్పారావు తెలంగాణ రాష్ట్ర షూటింగ్ అండర్–18 విభాగంలో రెండు బంగారు పతకాలు సాధించాడు. యూనివర్సిటీ ఆఫ్ హైదరాబాద్‌లో తెలంగాణ రైఫిల్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఈ నెల 25న 11వ రాష్ట్ర షూటింగ్ చాంపియన్ షిప్ పోటీలు నిర్వహించారు. అండర్–18 యూత్ మెన్స్ కేటగిరిలో నృసింహ ప్రతిభ కనబరిచి ట్రాప్, డబుల్ ట్రాప్ పోటీల్లో ప్రథమ స్థానంలో నిలిచి రెండు బంగారు పతకాలు కైవసం చేసుకున్నాడు. 9వ తరగతి చదువుతున్న నృసింహ అక్టోబర్‌లో చెన్నైలో నిర్వహించే సౌత్‌జోన్ పోటీల్లో పాల్గొననున్నాడు. స్కూల్‌లో బాస్కెట్‌బాల్ జట్టుకు సైతం ప్రాతినిధ్యం వహిస్తున్నాడు. గుజరాత్ రాష్ట్రంలోని వడోదరలో నిర్వహించిన బాస్కెట్ బాల్ పోటీల్లో తమ స్కూల్ జట్టు తృతీయ స్థానంలో నిలవడంలో ప్రతిభ కనబరిచాడు. భారతదేశానికి ఒలింపిక్స్‌లో గోల్డ్‌మెడల్ సాధించడమే తన లక్ష్యమని పేర్కొన్నాడు.

### శిల్పి కరుణాకర్‌కు తానా ఆహ్వానం



**పెనుమంట్ర:** అమెరికాలో మిచిగన్‌లో జూలై 3 నుంచి మూడు రోజులు పాటు జరిగే తానా మహాసభలకు పెనుమంట్ర మండలం నత్తా రామేశ్వరం గ్రామానికి చెందిన ప్రముఖ శిల్పి పెనుగొండ కరుణాకర్‌కు ఆహ్వానం లభించింది. ఈ నెల 30న అమెరికాకు వెళ్తున్నట్లు ఆయన తెలిపారు.

### రోడ్డు ప్రమాదంలో బాలికకు గాయాలు

**భీమవరం:** భీమవరం రెండో పట్టణంలోని డాక్టర్ బీవీ రాజు రోడ్డులో సైకిల్‌పై వెళ్తున్న అక్కాచెల్లెళ్లను శుక్రవారం వెనుక నుంచి లారీ ఢీకొట్టింది. సైకిల్ వెనుక కూర్చొన్న బాలిక చేతికి, కాలికి గాయమైంది. ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నట్లు సీఐ జి. కాళీచరణ్ తెలిపారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామన్నారు.


తాడేపల్లిగూడెం మండలం జగన్నాథపురం - మాధవరం రోడ్డు దుస్థితి


జగన్నాథపురం దర్గా నుంచి జగన్నాథపురం వెళ్ళే రహదారి


జగన్నాథపురం- దండగర్ర రహదారిలో మెటల్ చిప్స్ పైకి లేచిన దృశ్యం

# ఈ రోడ్లపై ప్రయాణం.. నరకం

ఇటీవలి వర్షాలకు తాడేపల్లిగూడెం మండలంలోని రహదారులు బురదమయంగా మారాయి. జగన్నాథపురం – మాధవరం, జగన్నాథపురం – దండగర్ర, జగన్నాథపురం దర్గా నుంచి జగన్నాథపురం వెళ్ళే రహదారులు గుంతలమయంగా తయారయ్యాయి. తాడేపల్లిగూడెం – నిడదవోలు వెళ్ళే వాహనాలను నవాబుపాలెం, జగన్నాథపురం, మాధవరం, అప్పారావుపేట మీదుగా మళ్లించడంతో వాహనాల రాకపోకలు పెరిగి గుంతలు మరింత పెద్దవిగా మారుతున్నాయి. మరో మూడు నెలల పాటు నిడదవోలు వెళ్లే వాహనాలు ఈ రహదారిలోనే రాకపోకలు సాగించాల్సి ఉంది. నిడదవోలు రైల్వే గేట్ వద్ద రైల్వే ఓవర్‌బ్రిడ్జి నిర్మాణం కారణంగా వాహనాలను మళ్లిస్తున్నారు. ఎదురుగా వాహనం వస్తే పక్క నుంచి తప్పించుకునే వెళ్ళే అవకాశం కూడా లేకపోవడంతో వాహనదారులు ఇబ్బందులు పడుతున్నారు. ఏ మాత్రం అదుపు తప్పినా గుంతల్లో పడి గాయాలపాలవుతున్నారు. అధికారులు స్పందించి ఈ రహదారులపై ఏర్పడిన గుంతలను తాత్కాలిక ప్రాతిపదికన పూడ్చాలని కోరుతున్నారు.

– తాడేపల్లిగూడెం రూరల్

# పోక్సో కేసులో 20 ఏళ్ల జైలు

**స్పీడ్ ట్రయల్ కోర్టు న్యాయమూర్తి తీర్పు**


పోక్సో కేసులో శిక్ష పడిన షేక్ ఇబ్రహీం (ఫైల్)

**ఏలూరు టౌన్ :** బాలికలపై అఘాయిత్యాలకు పాల్పడుతున్న నిందితులకు కఠిన శిక్షలు పడేలా ఏలూరు జిల్లా పోలీస్ యంత్రాంగం ప్రత్యేక చర్యలు చేపడుతోంది. జంగారెడ్డిగూడెం సుబ్బంపేట కాలనీలో ఏడాదిన్నర క్రితం బాలికపై లైంగిక దాడికి పాల్పడిన షేక్ ఇబ్రహీంకు 20 ఏళ్ళ జైలు శిక్ష, రూ.5 వేల జరిమానా విధిస్తూ ఏలూరు స్పెషల్ కోర్టు ఫర్ స్పీడ్ ట్రయల్ ఆఫ్ అఫెన్స్ అండర్ పోక్సో యాక్ట్ కోర్టు న్యాయమూర్తి కే.వాణిశ్రీ తీర్పు చెప్పారు. బాధిత బాలికకు రూ.50 వేల నష్ట పరిహారం అందజేయాలని ఆదేశించారు. జంగారెడ్డిగూడెం సాయిబాబా గుడి వెనుక సుబ్బంపేట కాలనీకి చెందిన షేక్ ఇబ్రహీం మెడికల్ షాపు నిర్వహిస్తున్నాడు. అతను బాధిత బాలిక పాఠశాలకు, ట్యూషన్‌కు వెళ్ళే సమయాల్లో తినుబండారాలు ఇస్తూ మాయమాటలు చెప్పి లోబర్చుకున్నాడు. 2024 ఫిబ్రవరి 6కు ముందు అనేక మార్లు లైంగిక దాడికి పాల్పడ్డాడు. బాలిక ఇంటికి ఆలస్యంగా రావటం గమనించిన నానమ్మ బాలికను ప్రశ్నించగా.. భయపడుతూ విషయాన్ని చెప్పింది. 2024 ఫిబ్రవరి 10న నానమ్మ జంగారెడ్డిగూడెం పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేయగా అప్పటి ఎస్ఐ జ్యోతిబసు కేసు నమోదు చేశారు. అప్పటి సీఐ ఎం.ధనుంజయుడు, జంగారెడ్డిగూడెం డీఎస్పీ యూ.రవిచంద్ర కేసును ప్రత్యేకంగా తీసుకుని దర్యాప్తు చేశారు. పోక్సో కోర్టు ప్రత్యేక ప్రభుత్వ న్యాయవాది వీ.అమర శ్రీనివాస్ వాదనలు వినిపించారు. నేరానికి పాల్పడినట్లు నిర్ధారిస్తూ ఇబ్రహీంకు 20 ఏళ్ళ జైలు శిక్ష విధిస్తూ న్యాయమూర్తి తీర్పు వెలువరించారు. నిందితులకు కఠిన శిక్షలు పడడంతో ప్రతిభ చూపిన పోలీసు అధికారులు, సిబ్బందిని జిల్లా ఎస్పీ కేపీ శివకిషోర్ అభినందించారు.

# బస్టాండ్ కాదు.. బురద గుంట


బస్సెక్కాలంటే బురదలో దిగాల్సిందే


ఉండి బస్టాండ్‌లో భారీ గుంతలు

**ఉండి:** ఆర్టీసీ ప్రయాణం సురక్షితమని ఊదరగొట్టే అధికారులు ఉండి బస్టాండ్ దుస్థితిని ఎందుకు పట్టించుకోవట్లేదని ప్రయాణికులు మండిపడుతున్నారు. ఉండిలో ఒకరోజు వర్షం కురిస్తే బస్టాండ్‌కు వెళ్ళే ప్రయాణికులకు వారం రోజులు కష్టాలు తప్పవు. బస్టాండ్ ప్రాంతం, రోడ్లు బురదమయంగా మారిపోతాయి. బస్టాండ్‌లో భీమవరం వైపు బస్సులు వెళ్ళాలంటే బురద, గణపవరం, ఆకివీడు వైపుగా వెళ్ళాలంటే బస్సులు తిరగబడిపోతాయేమోనని భయపడేంత పెద్ద పెద్ద గోతులు దర్శనమిస్తాయి. ఉండి బస్టాండ్ ఇక్కట్లపై ఎన్నిసార్లు మొరపెట్టుతున్నా ఫలితం శూన్యం. తాగేందుకు నీరు ఉండదు. బస్టాండ్ చుట్టూ మురుగు నీరే. బస్టాండ్‌లో బస్సు దిగాలంటే బురదలో కాలుపెట్టాల్సిందే. దీనివల్ల మహిళా ప్రయాణికులు, విద్యార్థులు, వృద్ధులు తీవ్ర ఇబ్బంది పడుతున్నారు. బస్సులో నుంచి దిగేటప్పుడు ఒక్కోసారి కాలుజారి పడిపోతున్నారు. బస్సులు బస్టాండ్ నుంచి బయటకు వెళ్ళాలంటే డ్రైవర్‌లు తీవ్రంగా శ్రమించాల్సిందే. ఒకవైపు బురద, మరోవైపు గోతుల వల్ల బస్సులు తిప్పడం ఇబ్బందిగా ఉంది. ఇప్పటికైనా అధికారులు, ప్రజాప్రతినిధులు కనీస మౌలిక వసతులపై దృష్టిపెట్టడంతో పాటు.. రోడ్లు వేసేలా తీసుకోవాలని ప్రయాణికులు కోరుతున్నారు.

# జల విద్యుత్ కేంద్రం పనుల పరిశీలన


పోలవరం ప్రాజెక్టు జలవిద్యుత్ కేంద్రం పనులు పరిశీలిస్తున్న జెన్‌కో డైరెక్టర్ సుజయ్‌కుమార్ తదితరులు

**పోలవరం రూరల్ :** పోలవరం ప్రాజెక్ట్ పూర్తయ్యే సమయానికి జల విద్యుత్ కేంద్రాన్ని కూడా సిద్ధం చేయాలని ఏపీ జెన్‌కో డైరెక్టర్ (హైడల్) ఎం.సుజయ్‌కుమార్ అన్నారు. నిర్దేశిత సమయానికి ప్రాజెక్టును పూర్తి చేసేందుకు ప్రణాళిక సిద్ధం చేసుకోవాలని జెన్‌కో అధికారులు కాంట్రాక్టు సంస్థకు సూచించారు. పోలవరం ప్రాజెక్ట్ డయాఫ్రం వాల్, ఈసీఆర్ఎఫ్ పనులకు సమాంతరంగా విద్యుత్ కేంద్రం పనులు చేపట్టాలన్నారు. శుక్రవారం పోలవరం జల విద్యుత్ కేంద్రంలో కీలకమైన 150/30 టన్నుల సామర్థ్యం కలిగిన క్రేన్ పనితీరును పరీక్షించి పూజలు చేసి సుజయ్‌కుమార్ ప్రారంభించారు. జల విద్యుత్ కేంద్రంలో టర్బయిన్‌లు, జనరేటర్ వంటి కీలకమైన పరికరాలను బిగించేందుకు ఈ క్రేన్‌ను ఉపయోగిస్తారు. త్వరలో 225/40 టన్నుల సామర్థ్యం కలిగిన రెండు క్రేన్‌లను ఏర్పాటు చేస్తామని ఎంఈఐఎల్ చీఫ్ ఆపరేటింగ్ ఆఫీసర్ సతీష్‌బాబు అంగర తెలిపారు. టర్బయిన్లు, జనరేటర్లను బిగించే పని త్వరలో ప్రారంభిస్తామని వివరించారు. ఈ కార్యక్రమంలో జెన్‌కో హెచ్‌పీసీసీ ఈ.నాగరాజు, సీఈ (సివిల్) రవీంద్రారెడ్డి, ఎస్ఈ (సివిల్) రామచంద్రరాజు తదితరులు పాల్గొన్నారు.

# అచ్చియ్యపాలెంలో విషాద ఛాయలు


బుట్టాయగూడెం మండలం అచ్చియ్యపాలెంలో యువకుల మృతితో చర్చించుకుంటున్న గ్రామస్థులు

**బుట్టాయగూడెం:** బుట్టాయగూడెం మండలం అచ్చియ్యపాలెం(చిన్నరవ్వారిగూడెం)లో విషాద ఛాయలు అలుముకున్నాయి. ఒకే గ్రామానికి చెందిన ముగ్గురు యువకులు ఈతకొట్టేందుకు వెళ్ళి మృత్యువాత పడడం వారి కుటుంబాల్లో తీవ్ర విషాదం నింపింది. మృతి చెందిన తెల్లం సీతారామరాజు, తెల్లం కిశోర్‌లు అన్నదమ్ములు. తండ్రి తెల్లం పోసీరావు గోపాలపురం మండలం సాకిపాడులో ఉపాధ్యాయుడిగా పనిచేస్తున్నారు. మృతుడు సీతారామరాజుకు 2021 కరోనా సమయంలో వివాహమైంది. సీతారామరాజుకు భార్య, 4 నెలల పాప ఉంది. చిన్న కొడుకు కిశోర్ జంగారెడ్డిగూడెంలోని ఒక ప్రైవేటు పాఠశాలలో డిగ్రీ పూర్తి చేశాడు. ఇద్దరు కుమారుల మృతితో తల్లిదండ్రులు తమ పిల్లల మృతదేహాలను చూసి తల్లడిల్లిపోయారు. మృతుడు మాడి దేవేంద్రకుమార్ తండ్రి మాడి సోమరాజు వ్యవసాయ కూలీ. సోమరాజుకు ఇద్దరు కుమారులు. సోమరాజు మొదటి కుమారుడు చిన్నతనంలోనే కరెంట్ షాక్‌తో మృతి చెందాడు. దేవేంద్ర విజయవాడలో డిగ్రీ మొదటి సంవత్సరం చదువుతున్నాడు. సరదా కోసం వెళ్ళి ప్రాణాలు కోల్పోయాడు. ఒకే గ్రామానికి చెందిన ముగ్గురు యువకులు మృతితో గ్రామంలో విషాద చాయలు అలముకున్నాయి. యువకుల మృతి సమాచారం తెలుసుకున్న జీలుగుమిల్లి సీఐ వెంకటేశ్వరరావు, బుట్టాయగూడెం ఎస్సై దుర్గామహేశ్వరరావులు సంఘటనా స్థలానికి చేరుకుని వివరాలు సేకరించారు. వారు మాట్లాడుతూ ఈతకు ఐదుగురు వెళ్ళారని ఈత రాని కారణంగా ముగ్గురు మృతిచెందినట్లు గుర్తించామని చెప్పారు. దండిపూడి సమీపంలో ఉన్న కాల్వ సమీపానికి ఎవరూ కూడా ఈత కోసం వెళ్ళొద్దని సీఐ చెప్పారు. గతంలో హెచ్చరిక బోర్డులు ఏర్పాటు చేశామని, వర్షాల కారణంగా అవి కొట్టుకుపోయాయని చెప్పారు. మళ్లీ హెచ్చరిక బోర్డులు ఏర్పాటు చేస్తామని చెప్పారు. మృతదేహాలను పోస్టుమార్టం కోసం జంగారెడ్డిగూడెం తరలించామని తెలిపారు.

# దేవుడి విగ్రహాల ఏర్పాటుపై రగడ


గ్రామస్తులతో మాట్లాడుతున్న మాజీ సర్పంచ్ బసవరాజు నగేష్, ఎస్ఐ జ్యోతిబసు

**నూజివీడు:** మండలంలోని పాత రావిచర్లలో దేవుడి విగ్రహాల రగడ ఉద్రిక్త పరిస్థితులకు దారితీసింది. గ్రామంలోని ప్రధాన సెంటర్‌లో ఉన్న పంచాయతీకి చెందిన లైబ్రరీ బిల్డింగ్‌లో సోమవారం అర్ధరాత్రి ఒక వర్గం వారు కృష్ణుడి విగ్రహాన్ని పెట్టారు. మూడు రోజులైనా విగ్రహాన్ని తీయకపోవడంతో గ్రామస్తులంతా కలిసి అదే లైబ్రరీలో శుక్రవారం ఉదయం 9 గంటల సమయంలో వినాయకుడి విగ్రహం, అమ్మవారి విగ్రహాలను వేదమంత్రాల నడుమ మేళతాళాలతో ఏర్పాటు చేశారు. దీంతో గ్రామంలో విగ్రహాల ఏర్పాటు విషయం వర్గపోరుగా మారి లైబ్రరీ వద్దకు వందలాది మంది గ్రామస్తులు చేరుకోవడంతో తీవ్ర ఉద్రిక్త వాతావరణం నెలకొంది. ఇరు వర్గాలు ఈ విషయమై తీవ్ర వాగ్వాదానికి దిగారు. మాజీ సర్పంచి బసవరాజు నగేష్ అక్కడకు చేరుకుని ఇరువర్గాలకు సర్దిచెప్పే ప్రయత్నం చేశారు. పంచాయతీ భవనంలో విగ్రహాలు పెట్టడమేంటని ప్రశ్నించారు. రూరల్ ఎస్ఐ జ్యోతిబసు సిబ్బందితో అక్కడకు చేరుకున్నారు. గ్రామ పెద్దలు ఎంతగా సర్ది చెప్పినా.. ఆయా వర్గీయులు ఏమాత్రం వినకుండా విగ్రహాలు ఉండాల్సిందేనంటూ పట్టు బట్టారు. మాజీ సర్పంచ్ ఇరువర్గాలను అక్కడి నుంచి పంపించి వేశారు. మధ్యాహ్నం 2 గంటల సమయంలో పోలీసుల బందోబస్తు మధ్య విగ్రహాలను తొలగించడంతో సమస్య తొలగిపోయింది.

### 29న తణుకులో జిల్లా స్థాయి రోల్‌బాల్ పోటీలు

**తణుకు అర్బన్:** నాల్గవ జిల్లాస్థాయి రోల్ బాల్ పోటీలు ఈనెల 29వ తేదీన తణుకు మునిసిపల్ స్కేటింగ్ పార్కులో నిర్వహించనున్నట్లు జిల్లా రోల్ బాల్ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి వి.లావణ్య తెలిపారు. అసోసియేషన్ ఆధ్వర్యంలో ఈ పోటీలు అండర్ 11, 14, 17 విభాగాలతో పాటు 17 సంవత్సరాలు దాటిన వారికి నాలుగు విభాగాల్లో నిర్వహిస్తామని, అర్హులైన క్రీడాకారులు తమ పేర్లను శనివారంలోపుగా నమోదు చేసుకోవాలని వివరించారు. ఇతర వివరాలకు 9642331332 నంబరులో సంప్రదించాలని కోరారు.

### ఇద్దరికి గాయాలు

**పోలవరం రూరల్:** పోలవరం ప్రాజెక్టు నిర్మాణ పనులు జరుగుతున్న పైడిపాక ప్రాంతంలో రోడ్డు ప్రమాదంలో ఇద్దరికి గాయాలయ్యాయి. వీరిని పోలవరం వైద్యశాలకు తరలించగా, ప్రాథమిక చికిత్స అందించి, 108 అంబులెన్స్‌లో మెరుగైన వైద్యం కోసం రాజమండ్రి తరలించారని ఎస్సై ఎస్ఎస్ పవన్‌కుమార్ తెలిపారు. ప్రాజెక్టులో సబ్ కాంట్రాక్టర్ వద్ద పనిచేస్తున్న నౌషద్ ఆలం, బిజయ్‌కుమార్‌తో కలిసి మోటార్ సైకిల్‌పై వెళుతుండగా, ఎదురుగా వస్తున్న బొలేరో వాహనం అతివేగంగా ఢీకొందన్నారు. ఇద్దరికీ గాయాలు కాగా, పరిసర ప్రాంతంలోని వారు వెంటనే స్పందించి వైద్యశాలకు తరలించినట్లు పేర్కొన్నారు. ఈ మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్సై పవన్‌కుమార్ తెలిపారు.

## రిటైల్ సేల్స్ అసోసియేట్ కోర్సులో ఉచిత శిక్షణ

**ఏలూరు (టూటౌన్):** యువతకు ఉపాధి అవకాశాలను కల్పించేందుకు రిటైల్ సేల్స్ అసోషియేట్ కోర్సులో ఉచిత శిక్షణ ఇవ్వనున్నట్టు జిల్లా ఉపాధి అధికారి వి.వరలక్ష్మి శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. జిల్లా ఉపాధి కార్యాలయం ఏలూరులో నిర్వహించే శిక్షణకు 10వ తరగతి ఉత్తీర్ణత సాధించి, 18 సంవత్సరాలు నిండినవారు అర్హులని పేర్కొన్నారు. ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలని, పూర్తి వివరాలకు ఫోన్ నంబర్ 88868 82032లో సంప్రదించవచ్చన్నని తెలిపారు.

## రోడ్ల అవస్థపై గ్రామస్తుల నిరసన


కొయ్యలగూడెం మండలం పొంగుటూరులో రహదారిపై ఆందోళన చేస్తున్న గ్రామస్తులు

**కొయ్యలగూడెం :** రహదారి అధ్వానంపై పొంగుటూరు గ్రామస్తులు నిరసన వ్యక్తం చేస్తూ శుక్రవారం ఆందోళన నిర్వహించారు. పొంగుటూరు, యర్నగూడెం గ్రామాల మధ్య పదిహేను కిలోమీటర్ల మేర ఉన్న రహదారి భారీ గోతులు పడి ప్రమాదకరంగా మారింది. గ్రీన్ ఫీల్డ్ హైవే వాహనాలు పరిమితికి మించి మెటీరియల్ రవాణా చేయడం వల్లే రోడ్డు పాడైంది. రెండేళ్ల క్రితం సుమారు రూ.30 లక్షలతో కన్నాయగూడెం నుంచి పొంగుటూరు వరకు రహదారిని నిర్మించగా పూర్తిగా పాడైంది. స్కూల్ బస్సులు మరమ్మతులకు గురవుతున్నాయని యాజమాన్యం రాకపోకలు నిలిపివేయడంతో విద్యార్థులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారన్నారు. ఇప్పటికైనా పాలకులు, అధికారులు తక్షణమే స్పందించి రహదారి అభివృద్ధి చేపట్టాలని కోరారు. గ్రీన్ ఫీల్డ్ హైవే నిర్వాహకులపై చర్యలు తీసుకోవాలని కలెక్టర్ వెట్రిసెల్విని మహిళలు కోరారు. ఈ ఆందోళనకు రైతు సంఘం నాయకులు మద్దతు తెలిపారు.

## ఏపీయూడబ్ల్యూజే కార్యవర్గ సభ్యుడిగా మురళీకృష్ణ



**భీమవరం :** ఆంధ్రప్రదేశ్ యూనియన్ ఆఫ్ వర్కింగ్ జర్నలిస్ట్స్ (ఏపీయూడబ్ల్యూజే) రాష్ట్ర కార్యవర్గ సభ్యుడిగా తాడేపల్లిగూడెం సాక్షి విలేకరి యడ్లపల్లి మురళీకృష్ణ ఎన్నికయ్యారు. ఒంగోలులో మూడు రోజుల పాటు నిర్వహించిన యూనియన్ 36వ మహాసభల్లో ఆయనను ఎన్నుకున్నారు. ఐజేయూ కార్యదర్శి డి.సోమసుందర్, యూనియన్ జిల్లా అధ్యక్ష కార్యదర్శులు వీఎస్ సాయిబాబా, గజపతి వరప్రసాద్, నేషనల్ కౌన్సిల్ సభ్యులు బెల్లంకొండ బుచ్చిబాబు, ముత్యాల శ్రీనివాస్ తదితరులు ఆయనకు అభినందనలు తెలిపారు.

## గేదెలను చంపిన దుండగులు


మతంగూడెం గ్రామంలో పశువుల పాకలో మూడు గేదెలను చంపిన దృశ్యం

**లింగపాలెం:** మండలంలోని మఠంగూడెం శివారులో దారుణ ఘటన చోటుచేసుకుంది. గేదెలను దుండగులు తలలు నరికి చంపారు. బాధితుడు తెలిపిన వివరాల ప్రకారం.. లింగపాలెం మండలం మఠంగూడెం శివారు సుందరావుపేట గ్రామంలో తొర్లపాటి రవి పశువుల పాకలో మూడు గేదెలను గురువారం రాత్రి సమయంలో గుర్తుతెలియని వ్యక్తులు క్రూరంగా తలలు నరికి చంపారు. శుక్రవారం ఉదయాన్నే గుర్తించిన రైతు రవి ధర్మాజీగూడెం పోలీసులకు సమాచారం అందించారు. పోలీసులు పరిశీలించి కేసు నమోదు చేశారు. ఇలాంటి ఘటనలు మళ్లీ జరగకుండా నిందితులను త్వరగా పట్టుకుని శిక్షించాలని చుట్టుపక్కల గ్రామాల వారు కోరుతున్నారు.

# నడక యాతన!

- అధ్వానంగా గ్రామీణ రహదారులు
- చెరువులను తలపిస్తున్న వైనం

పెంటపాడు: కూటమి పాలనలో చెప్పిన మాటలకు చేసిన పనులకు పొంతన లేకుండా పోతోంది. ప్రభుత్వం అధికారంలోకి వస్తే, ప్రధానంగా రహదారుల తీరు మారుస్తాం. గుంతలు లేని నాణ్యమైన రోడ్లు వేస్తాం. అంటూ ప్రగల్భాలు పలికి నేడు వాటి విషయంలో ప్రభుత్వం పట్టించుకోవడం లేదు. ప్రధానంగా బాదంపూడి నుంచి ప్రత్తిపాడు, పెంటపాడు మండలంలో పలు రహదారులు గతం కన్నా మరింత గుంతలు పడి ఇబ్బందిగా తయారయ్యాయి. గత మూడు నెలల క్రితం ఈ రహదారులపై మరమ్మతులు చేశారు. దీనికి తోడు వర్షం తోడయ్యింది. ఎక్కడ గోతులు ఉన్నాయో వాహనచోదకులకు తెలియక ప్రమాదాలు బారిన పడుతున్నారు. ఇటీవల ప్రత్తిపాడు- బాదంపూడి మధ్య గూడెంలో ప్యాచ్ వర్కుల చేశారు. కానీ గత రెండు రోజుల నుంచి కురిసిన వర్షం వల్ల పై పూతగా వేసిన తారు కొట్టుకు పోయింది. పెంటపాడు నుంచి విప్పర్రు మీదుగా గణపవరం వరకు రోడ్డు వేస్తున్నారు. కాగా ఆ రోడ్డు పూర్తి అవ్వలేదు. పైన కొంచెం పొరగా వేసిన తారు వర్షాకాలం రాకుండానే తొలగిపోయింది. కొన్ని చోట్ల రాళ్లు పైకి లేచి ఉండటంతో నానా అవస్థలు పడుతున్నారు. కూటమి ప్రభుత్వం వస్తే రహదారుల తీరు మారుతుందని అనుకొన్న ప్రజలకు నిరాశే మిగిలిందని ప్రత్యక్షంగా ప్రజలు చెబుతున్నారు. వర్షాకాలంలోపే రహదారులు వేస్తామని చెప్పిన మాట నీటి మూట అయ్యిందని ప్రజలు చెబుతున్నారు. ప్రధానంగా ప్రత్తిపాడు దుర్గమ్మ ఆలయం నుంచి ప్రత్తిపాడు సెంటర్‌కు వెళ్లే రహదారికి ఇటీవల మరమ్మతులు చేశారు. అయితే రెండు రోజులుగా కురుస్తున్న వర్షం వల్ల ఉన్న గోతులు మరింత పెద్దవిగా తయారయ్యాయి. ప్రత్తిపాడు పంచాయతీ కార్యాలయం నుంచి కాగులంపాడు వేళ్లే రహదారిపై కూడా గోతులు మరింత పెద్దవిగా తయారయ్యాయి. ఈ రహదారిలో క్వారీ లారీలు ఎక్కువగా తిరగడం వల్ల కూడా ప్యాచ్‌వర్కులు పని చేయడం లేదు. ఇప్పటికైనా మరమ్మతులు నాణ్యతతో చేపట్టాలని ప్రజలు కోరుతున్నారు.


పెంటపాడు మండలంలో ఛిద్రమైన రహదారి


ప్రత్తిపాడు- బాదంపూడి రహదారిలో గోతుల్లో నిలిచిన వర్షం నీరు


నిర్మాణలోపం వల్ల రాళ్లు పైకి లేచిన పడమరవిప్పర్రు- గణపవరం రహదారి


కె.పెంటపాడు రోడ్డుపై వర్షం నీరు నిలిచిపోయిన దృశ్యం

## క్లుప్తంగా

### దుర్గమ్మ ఆలయంలో అన్నదానం


ఆలయంలో అన్నసమారాధన దృశ్యం

పెంటపాడు: ప్రత్తిపాడు కాగులంపాడు రోడ్డులో కనకదుర్గమ్మ అమ్మవారి ఆలయంలో శుక్రవారం భారీ అన్నసమారాధన నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రతి శుక్రవారం అమ్మవారి ఆలయంలో అన్నదానం ఏర్పాటు కార్యక్రమంలో భాగంగా అలంపురం గ్రామానికి చెందిన చుండ్రు పార్వతీశం, ఆయన కుమార్తె జ్యోతిర్మయిల ఆధ్వర్యంలో ఈ అన్నదానం కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. సుమారు 350 మంది భక్తులు అన్న ప్రసాదం స్వీకరించారు. ఆలయ అర్చకులు సాతులూరి పవన్‌కుమార్ ప్రత్యేక పూజలు చేశారు. కమిటీ అధ్యక్షుడు బడేటి ఉదయ భాను, గ్రామస్తులు, దాతలు పాల్గొన్నారు.

### లయన్స్ సేవలు అభినందనీయం


నూతన కార్యవర్గ ప్రమాణ స్వీకారోత్సవం

తాడేపల్లిగూడెం (టీఓసీ): లయన్స్‌క్లబ్ ఆఫ్ తాడేపల్లిగూడెం నూతన కార్యవర్గ ప్రమాణ స్వీకారోత్సవం శుక్రవారం స్థానిక గమిని పంక్షన్ హాల్‌లో ఘనంగా జరిగింది. నూతన అధ్యక్షుడిగా చిన్నం మణీంద్ర, సెక్రటరీగా పోతురాజు (త్రిమూర్తులు), కోశాధికారిగా జీ.కిరణ్‌కుమార్‌లు ఎన్నిక కాగా వీరిచేత ప్రమాణ స్వీకారం మాజీ జిల్లా గవర్నర్ డీవీవీకే పంకజాక్షన్ చేయించారు. గట్టిం మాణిక్యాలరావు, వీవీఎన్ లక్ష్మీనారాయణలు మాట్లాడుతూ లయన్స్ క్లబ్ సేవలు అభినందనీయమన్నారు. నిరుపేద మహిళలకు నిత్యావసర వస్తువులు, బియ్యం బస్తాలు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో పదంకుమార్‌గుప్తా, ఎల్ఎస్‌వీ నాగేశ్వరరావు, గరికపాటి బాపయ్యశర్మ, జీడిగుంట హరిబాబు, సుంకర శ్రీనివాస్, షేక్ బాజీ, గ్రంధి సత్యనారాయణ, గమిని సుబ్బారావు, ఆకుల ధనశేఖర్, తదితరులు మాట్లాడారు. క్లబ్ సభ్యులు పాల్గొన్నారు.

### శ్రేష్ఠలో సత్తా చాటిన గురుకుల విద్యార్థులు


జి. మహేష్


కే.సుభాష్

తాడేపల్లిగూడెం రూరల్: దేశ వ్యాప్తంగా కేంద్ర ప్రభుత్వం నిర్వహించిన శ్రేష్ఠ పరీక్షలో తాడేపల్లిగూడెం మండలం పెదతాడేపల్లి డాక్టర్ బీఆర్.అంబేడ్కర్ సాంఘీక, సంక్షేమ గురుకుల పాఠశాల విద్యార్థులు సత్తా చాటారు. గురుకుల పాఠశాల నుంచి 140మంది విద్యార్థులు హాజరు కాగా, వారంతా అర్హత సాధించినట్లు ప్రిన్సిపల్ బి.రాజారావు శుక్రవారం తెలిపారు. జాతీయ స్థాయిలో తొమ్మిదవ తరగతి నుంచి జి. మహేష్ 903వ ర్యాంకు, కే.సుభాష్ 1012వ ర్యాంకు, 11వ తరగతికి జరిగిన పరీక్షలో పి.జాయ్ సందీప్ 1122వ ర్యాంకు, డి.రాజేష్ 1160వ ర్యాంకు సాధించారన్నారు. గురుకులం నుంచి మొత్తం 30 మంది విద్యార్థులకు దేశంలోని పేరుగాంచిన ప్రైవేట్ విద్యాసంస్థల్లో ఉచితంగా విద్యనభ్యసించే అవకాశం లభించనుందన్నారు. హాస్టల్ సౌకర్యాన్ని కేంద్ర ప్రభుత్వం కల్పిస్తుందన్నారు. ఈ సందర్భంగా విద్యార్థులను ప్రిన్సిపల్ బి.రాజారావు, ఉపాధ్యాయులు అభినందించారు.

### తణుకు విద్యుత్ శాఖ డీఈఈగా దివాకర్



తణుకు అర్బన్: విద్యుత్ శాఖ తణుకు సబ్ డివిజన్ డిప్యూటీ ఎగ్జిక్యూటివ్ ఇంజనీరుగా (డీఈఈ) బోడపాటి దివాకర్ శుక్రవారం బాధ్యతలు స్వీకరించారు. తూర్పుగోదావరి జిల్లా రంపచోడవరం రూరల్ సబ్ డివిజన్ నుంచి బదిలీపై వచ్చిన ఆయనను విద్యుత్ శాఖ అధికారులు, సిబ్బంది, స్పాట్ బిల్లింగ్ కాంట్రాక్టర్స్ అసోసియేషన్ నాయకులు మర్యాదపూర్వకంగా కలిసి పుష్ప గుచ్ఛాలు అందచేశారు.

### ఇంజనీరింగ్ కార్మికుల సమస్యలను పరిష్కరించాలి

తాడేపల్లిగూడెం (టీఓసీ): ఏపీ ఇంజనీరింగ్ కార్మికుల సమస్యలను రాష్ట్ర ప్రభుత్వం తక్షణమే పరిష్కరించాలని జేఏసీ నాయకులు విజ్ఞప్తి చేశారు. సమ్మెలో భాగంగా జేఏసీ పిలుపు మేరకు పట్టణంలో శుక్రవారం ఐదో రోజు సమ్మె జరిగింది. రిలే దీక్ష శిబిరంలో కార్మికులు హాజరై మాట్లాడుతూ ప్రభుత్వం వెంటనే స్పందించి ఇంజనీరింగ్ కార్మికుల సమస్యలను పరిష్కరించాలని, తమ న్యాయమైన డిమాండ్స్‌ను అమలు చేయాలని డిమాండ్ చేశారు. లేని పక్షంలో సమ్మె ఉధృతం చేస్తామని హెచ్చరించారు.నాయకులు ఇంజనీరింగ్ సెక్షన్ కార్మికులు, మహిళా సిబ్బంది పాల్గొన్నారు.

## జాతీయ లోక్ అదాలత్‌ను విజయవంతం చేయండి


మాట్లాడుతున్న అదనపు జిల్లా జడ్జి షేక్ సికిందర్ బాషా, ఇతర జడ్జిలు

తాడేపల్లిగూడెం (టీఓసీ): జాతీయ లోక్ అదాలత్ జూలై 5వ తేదీన మొదటి శనివారం స్థానిక కోర్టు ఆవరణలో నిర్వహించనున్నట్లు మండల లీగల్ సర్వీసెస్ కమిటీ చైర్మన్, 11వ అదనపు జిల్లా జడ్జి షేక్ సికిందర్ బాషా వెల్లడించారు. స్థానిక బార్ అసోసియేషన్ కార్యాలయంలో న్యాయవాదులతో శుక్రవారం సమావేశం జరిగింది. బార్ అసోసియేషన్ అధ్యక్షుడు శిరిగినీడి విజయకృష్ణ అధ్యక్షత వహించారు. సికిందర్ బాషా మాట్లాడుతూ లోక్ అదాలత్‌లో రాజీ పడదగిన కేసులను తప్పక రాజీ చేయాలని, ఇరుపార్టీలు మధ్య రాజీ కుదిర్చి ఎక్కువ పెండింగ్ కేసులు పరిష్కారం అయ్యే విధంగా సహకరించాలని న్యాయవాదులను కోరారు. అదే విధంగా లోక్ అదాలత్‌లో అన్ని రకాల సివిల్ కేసులు, రాజీ పడదగ్గ క్రిమినల్ కేసులు, మెయింటెనెన్స్ కేసులు, మోటారు వాహన, ప్రమాద బీమా కేసులను కక్షిదారులు రాజీ పడవచ్చునని తెలిపారు. సీనియర్ సివిల్ జడ్జి కె.మాధవి, ప్రిన్సిపల్ జూనియర్ సివిల్ జడ్జి ఎస్.సూర్యకిరణ్‌శ్రీలు మాట్లాడుతూ లోక్ అదాలత్ తీర్పుపై అప్పీలు ఉండదని, కక్షిదారులు తప్పక ఈ అవకాశాన్ని వినియోగించుకోవాలని, రాజీ మార్గమే, రాజమార్గమని, కేసులు రాజీ అయితే డబ్బు, సొమ్ములు ఆదా అవుతాయని వివరించారు. ఈ కార్యక్రమంలో బార్ అసోసియేషన్ సెక్రటరీ భూపాల్, సీనియర్, జూనియర్ న్యాయవాదులు, కోర్టు సిబ్బంది, న్యాయవాదుల గుమస్తాలు పాల్గొన్నారు.

## లయన్స్‌క్లబ్‌లకు అందే విరాళాలతో సేవలు విస్తృతం


ఢాకాలో లయన్స్‌క్లబ్ ప్రతినిధులతో మాట్లాడుతున్న ఎమ్మెల్సీ రవీంద్రనాథ్

తణుకు అర్బన్: లయన్స్ క్లబ్‌లో భాగస్వామ్యులై ఎల్సీఎఫ్‌కు విరాళాలు ఇవ్వడం ద్వారా సేవ కార్యక్రమాలు మరింతగా విస్తృతం చేయవచ్చని శాసన మండలి సభ్యులు, లయన్స్ ఆంధ్రప్రదేశ్ పూర్వ చైర్మన్ వంక రవీంద్రనాథ్ అన్నారు. బంగ్లాదేశ్ రాజధాని ఢాకా నగరంలో 315 ఏ 2 జిల్లాలో లయన్స్ ఇంటర్నేషనల్‌కు విరాళాలు ద్వారా సపోర్ట్ చేసిన లయన్స్‌కు ధన్యవాదాలు తెలిపే కార్యక్రమంలో రవీంద్రనాథ్ ప్రత్యేక అతిథిగా హాజరయ్యారు. భారత, బంగ్లాదేశ్ దేశాలు మిత్ర దేశాలని ప్రజలంతా పరస్పరం ప్రేమాభిమానాలను పంచుకుంటారని స్పష్టం చేశారు. ఆంధ్రప్రదేశ్ నుంచి లయన్స్‌క్లబ్ ద్వారా బంగ్లాదేశ్ లయన్స్ క్లబ్‌లకు పూర్తి సహకారం అందిస్తామని రవీంద్రనాథ్ తెలిపారు. ఢాకాలోని 315 ఏ 2 జిల్లా గవర్నర్ ఎలెక్ట్ శంకర్ కుమార్ రాయ్ రవీంద్రనాథ్‌ను అభిమానిస్తూ ప్రత్యేక మెడల్‌తో సత్కరించారు. సెకండ్ వైస్ గవర్నర్ మోసిన్ ఇమామ్ చౌడు, క్యాబినెట్ సెక్రటరీ శాంతి సాహు, పాస్ట్ డిస్ట్రిక్ట్ గవర్నర్ కురం నహర్, జలాల్ అహ్మద్ పాల్గొన్నారు.

## దేశవ్యాప్త సమ్మెను విజయవంతం చేయాలి


తణుకులో మునిసిపల్ కమీషనర్‌కు సమ్మె నోటీసు ఇస్తున్న ఏఐటీయూసీ నాయకులు

తణుకు అర్బన్: కార్మిక వ్యతిరేక నాలుగు లేబరు కోడ్స్ రద్దు కోరుతూ కేంద్ర కార్మిక సంఘాలు తలపెట్టిన జూలై 9 దేశ వ్యాప్త సమ్మె పిలుపులో భాగంగా శుక్రవారం తణుకు ఏఐటీయూసీ అనుబంధ మున్సిపల్ కాంటాక్ట్ వర్కర్స్ యూనియన్ ఆధ్వర్యంలో తణుకు మున్సిపల్ కమీషనర్ టి. రామ్‌కుమార్‌కు సమ్మె నోటీసు అందజేశారు. ఈ సందర్భంగా ఏఐటీయూసీ జిల్లా అధ్యక్షుడు కోనాల భీమారావు, మున్సిపల్ కాంటాక్టు వర్కర్స్ యూనియన్ తణుకు శాఖ అధ్యక్షుడు బొద్దాని నాగరాజు మాట్లాడుతూ నరేంద్రమోదీ ప్రభుత్వం కార్పొరేట్ వర్గాలకు అనుకూలంగా కార్మికులకు వ్యతిరేకంగా కార్మికులు పోరాడి సాధించుకున్న 44 కార్మిక చట్టాలను రద్దు చేసి నాలుగు లేబరు కోడ్స్ తేవడం జరిగిందన్నారు. అలాగే 8 గంటల పని రద్దు చేసి 10 గంటలు పని చేయాలని చట్టం చేయడం కార్మికులను కట్టు బానిసలను చేయడమేనని స్పష్టం చేశారు. ప్రభుత్వాల కార్మిక వ్యతిరేక విధానాలు నిరసిస్తూ కేంద్ర కార్మిక సంఘాలు తలపెట్టిన జూలై 9 దేశ వ్యాప్త సమ్మె విజయవంతం చేయాలని కోరారు. మున్సిపల్ కాంటాక్ట్ వర్కర్స్ యూనియన్ తణుకు శాఖ కార్యదర్శి మందుల ముత్తయ్య, గంద్రాపు శ్రీనివాసరావు, కొంబత్తుల రవికుమార్, సిర్రా వాణి, గెద్దాడ అన్నపూర్ణ, ముక్కెర రాములమ్మ, అర్జి శివ పార్వతి, మందుల లక్ష్మి, డి.బాలాజీ, ఎ.రమేష్, ఎ. శ్రీను పాల్గొన్నారు.

## భవిత సెంటర్‌లో హెలెన్ కెల్లర్ జయంతి


భవిత సెంటర్‌లో హెలెన్ కెల్లర్ జయంతి

తాడేపల్లిగూడెం (టీఓసీ): భవిత దివ్యాంగుల శిక్షణ కేంద్రంలో శుక్రవారం దివ్యాంగుల ఆశాజ్యోతి హెలన్ కెల్లర్ జయంతి కార్యక్రమం జరిగింది. చిత్రపటానికి పలువురు నివాళులర్పించారు. వక్తలు మాట్లాడుతూ హెలెన్ కెల్లర్ జీవిత విశేషాలను వెల్లడించారు. దివ్యాంగులకు తొలుత తల్లిదండ్రులు ప్రోత్సాహం తప్పక ఉండాలని, ప్రత్యేక ఉపాధ్యాయులు కృషి ఎంతో అవసరం అన్నారు. కెల్లర్ జీవితాన్ని ఆదర్శంగా భవిత విద్యార్థులు తీసుకోవాలని, విద్యార్థుల తల్లిదండ్రులు సహకరించాలని విజ్ఞప్తి చేశారు. భవిత సెంటర్ ఆధ్వర్యంలో జరుగుతున్న సేవా కార్యక్రమాలు, ప్రభుత్వ సంక్షేమాలు, ఫిజియోథెరపీ ఇతర అన్ని సేవలు దివ్యాంగులు ఉపయోగించుకోవాలని, సద్వినియోగం చేసుకోవాలని విజ్ఞప్తి చేశారు. వర్తనపల్లి కాశీ, యర్జాడ అనిల్ కుమార్, రంజిత్, పవన్, కళ్యాణిదేవి, ప్రత్యేక ఉపాధ్యాయులు బాల ఈశ్వరయ్య, ప్రాథమిక పాఠశాల హెచ్ఎం ఆర్.కోటయ్య తదితరులు పాల్గొన్నారు.

## ముగింపు దశకు మెగా డీఎస్సీ పరీక్షలు


డీఎస్సీ పరీక్షలకు హాజరైన అభ్యర్థులు

తాడేపల్లిగూడెం (టీఓసీ): రాష్ట్రంలో ఖాళీగా ఉన్న ఉపాధ్యాయ పోస్టుల నియామకంకోసం రాష్ట్ర ప్రభుత్వం విడుదలచేసిన మెగా డీఎస్సీ రాత పరీక్షలు ముగింపు దశకు చేరుకున్నాయి. తాడేపల్లిగూడెం శ్రీ వాసవి ఇంజనీరింగ్ కళాశాలలో మూడు షిఫ్టులలో శుక్రవారం ఉదయం, సాయంత్రం పరీక్షలు జరిగాయి. 300మందికిగాను 260మంది పరీక్షలకు హాజరైనట్లు కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ రత్నాకర్ తెలిపారు. అడ్మినిస్టేటర్ నటరాజ్, సిస్టమ్ అడ్మిన్ కొల్లా సురేష్, టీసీఎస్ సంస్థల ప్రతినిధులు పాల్గొన్నారు.

## మొక్కుబడిగా మండల సర్వసభ్య సమావేశం

కేవలం అధికారుల ప్రసంగాలకే పరిమితం

పెంటపాడు: పెంటపాడు మండల సర్వసభ్య సమావేశం శుక్రవారం మొక్కుబడిగా సాగింది. గ్రామాల్లో పలు సమస్యలు ఉన్నా ప్రజాప్రతినిధులు వాటిపై అధికారులను ప్రశ్నించేందుకు సాహసించక పోవడం విడ్డూరం. పెంటపాడు మండల సమావేశ మందిరంలో ఉదయం 12 గంటలకు ప్రారంభించిన సమావేశం 1.30 గంటలకు ముగిసింది. పలు శాఖల అధికారులు పాఠాలు అప్పగించినట్లు పేపర్లు చదవడం కనిపించింది. దీనిపై ప్రశ్నించేవారు లేకపోవడం విశేషం. ప్రధానంగా పలు గ్రామాల్లో పంట డ్రెయినేజీల పూడిక తీత పూర్తికాలేదు. తాగునీటి సమస్యలు, రహదారుల సమస్యలు, శానిటేషన్ సమస్యలు ఉన్నాయి. ఎక్కడి చెత్త అక్కడే ఉంది. కానీ వాటి గురించి మాట్లాడాల్సిన గ్రామాల సర్పంచ్‌లు, ఎంపీటీసీ సభ్యులు అధికారులను ప్రశ్నించక పోవడంతో సమావేశం మొక్కుబడిగా సాగింది. 22 గ్రామాల్లో మూడు నెలలకు ఒకసారి నిర్వహించే ఈ సమావేశం అధికారులు రాసుకొచ్చిన కాగితాలు చదవడంతోనే ముగిసింది. రేషన్, పింఛన్ సమస్యలతో పాటు, ప్రభుత్వ పథకాలపై ప్రశ్నించేవారు లేక పోవడం గమనార్హం.

**కంపోస్టు యార్డులకు ప్రాధాన్యత ఇవ్వాలి**

చెత్తను నిర్మూలించడంతో పాటు, ప్లాస్టిక్ వాడకాన్ని నిషేధించేలా గ్రామాలు ఉండాలని, ఆ దిశగా ప్రజాప్రతినిధులు కృషి చేయాలని ఎమ్మెల్యే బొలిశెట్టి శ్రీనివాస్ కోరారు. గ్రామాల అభివృద్ధిలో ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలన్నారు. ఎంపీపీ దాసరి హైమావతి, వైస్‌ఎంపీపీలు ముప్పిడి సరోజిని, కొణతాల వెంకట్రావు, డివిజనల్ డవలప్‌మెంట్ అధికారి ఎం. ప్రభాకరరావు, మండల తహసీల్దార్ రాజరాజేశ్వరి, ఎంపీడీవో బాలాజీ వెంకటరమణ, పంచాయతీరాజ్, గ్రామీణ నీటిసరఫరా, రహదారుల భవనాలశాఖ, ఇంజనీరింగ్, విద్యాశాఖ, స్త్రీ శిశు సంక్షేమం, హౌసింగ్ తదితర శాఖలకు చెందిన సర్పంచ్‌లు పాల్గొన్నారు.

## నేడు డయల్ యువర్ డీఎం

తణుకు అర్బన్: ఆర్టీసీ ప్రయాణికుల సౌకర్యార్థం శనివారం డయల్ యువర్ డీఎం కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు డిపో మేనేజరు సప్పా గిరిధర్ కుమార్ తెలిపారు. తణుకు ఆర్టీసీ డిపోకు సంబంధించి ఎక్స్‌ప్రెస్, పల్లెవెలుగు బస్సుల ప్రయాణాల్లో ప్రయాణికులు తమ విలువైన సలహాలు, సూచనలు, ఫిర్యాదులు తెలియజేసి డిపో అభివృద్ధికి పాటుపడాలని కోరారు. ఉదయం 9 నుంచి 10 గంటలలోపు 99592 25484 నంబరుకు ఫోన్ చేయాలని వివరించారు.

## చికిత్స పొందుతూ వ్యక్తి మృతి

పెంటపాడు: రహదారి ప్రమాదంలో తీవ్రంగా గాయపడిన వ్యక్తి చికిత్స పొందుతూ శుక్రవారం మృతి చెందాడు. పెంటపాడు ఎస్సై స్వామి తెలిపిన వివరాల ప్రకారం గూడెం వీకర్సు కాలనీకి చెందిన మానుపాటి జయరాజు (40) చేపలు, రొయ్యల కొనుగోలు వృత్తి చేస్తూ జీవనం సాగిస్తున్నాడు. కాగా ఈనెల 21న పని నిమిత్తం గూడెం నుంచి పరిమెళ్ల మీదుగా భీమవరం మోటార్ సైకిల్‌పై వెళ్తున్నాడు. పరిమెళ్ల వద్ద గుర్తుతెలియని వాహనం జయరాజును ఢీకొట్టింది. తీవ్ర గాయాలపాలైన ఈతనిని స్థానికులు గూడెం ఏరియా ఆస్పత్రికి తరలించారు. రియాఆసుపత్రికి తరలించారు. అక్కడి నుంచి మెరుగైన చికిత్స నిమిత్తం గుంటూరు ఆసుపత్రికి తరలించారు. ఆసుపత్రిలో చికిత్సపొందుతూ జయరాజు శుక్రవారం మృతి చెందినట్లు ఎస్సై తెలిపారు. కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

## తెనాలి ఘటనకు నిరసనగా చలో తెనాలి


తణుకులో చలో తెనాలి కరపత్రాలు ఆవిష్కరించిన అంబేడ్కర్, న్యాయవాదులు

తణుకు అర్బన్: తెనాలిలో దళిత, మైనారిటీ యువతపై పోలీసులు అక్రమ కేసులు, దాడి ఘటనలకు నిరసనగా ఈనెల 28వ తేదీన తెనాలి ఐతానగర్‌లో నిర్వహించే మానవ హక్కుల పరిరక్షణ రాష్ట్రస్థాయి సదస్సుకు హాజరయ్యేందుకు చలో తెనాలి కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు సామాజిక న్యాయపోరాట సమితి రాష్ట్ర గౌరవ అధ్యక్షుడు, సీనియర్ న్యాయవాది గొల్లపల్లి అంబేడ్కర్ తెలిపారు. శుక్రవారం తణుకు కోర్టు ఆవరణలో ఛలో తెనాలి కార్యక్రమానికి సంబంధించిన కరపత్రాన్ని ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సభ్యసమాజం తలదించుకునే విధంగా దళిత యువకులు చేబ్రోలు జాన్ విక్టర్, దోమ రాకేష్, షేక్ బాబూలాల్ అనే ముగ్గురు యువకులపై అక్రమ కేసుల్లో ఇరికించడమే కాకుండా నడిరోడ్డుపై బహిరంగంగా విచక్షణారహితంగా పోలీసులు చేసిన దాడి అత్యంత కిరాతకంగా ఉందన్నారు. పోలీసుల దౌర్జన్యకాండను హైకోర్టు సిట్టింగ్ జడ్జిచేత విచారణ జరిపించాలని, ఘటనలో పాల్గొన్న పోలీసు అధికారులు, సిబ్బందిపై కేసులు నమోదు చేయాలని కోరారు.

## మాదక ద్రవ్యాలకు యువత దూరంగా ఉండాలి


సమావేశంలో మాట్లాడుతున్న టి.అశోక్

తాడేపల్లిగూడెం (టీఓసీ): మాదక ద్రవ్యాలకు యువత దూరంగా ఉండాలని నన్నయ్య యూనివర్శిటీ ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ టి.అశోక్ తెలిపారు. గూడెంలో అంతర్జాతీయ మాదక ద్రవ్యాల వ్యతిరేక దినోత్సవాన్ని శుక్రవారం నిర్వహించారు. ఈ సందర్భంగా అశోక్ మాట్లాడుతూ విద్యార్థులు, యువత, మద్యం, మత్తు పదార్థాల జోలికి వెళ్లవద్దని, తమ జీవితాలను పాడు చేసుకోవద్దని తెలిపారు. ఈ కార్యక్రమంలో విద్యార్థినీ, విద్యార్థులు పాల్గొన్నారు.

## నేడు సీజనల్ వ్యాధుల నివారణపై సమీక్షా సమావేశం

అత్తిలి: స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో శనివారం ఉదయం సీజనల్ వ్యాధులు నివారణకు ముందస్తు ప్రణాళిక, పారిశుద్ధ్య కార్యక్రమాల అమలు, తాగునీటి సరఫరా, ఇతర ముఖ్యాంశాలపై సంబంధిత అధికారులతో తణుకు నియోజక వర్గ శాసన సభ్యులు అరిమిల్లి రాధాకృష్ణ రివ్యూ నిర్వహిస్తారని ఎంపీడీఓ పి. శ్యామ్యూల్ తెలిపారు. అత్తిలి మండలంలో గల ఎంపీటీసీ సభ్యులు, సర్పంచ్‌లు, ప్రజాప్రతినిధులు, కూటమి నాయకులు, అధికారులు పాల్గొనాలని కోరారు.

## పెనుగొండ ఫ్లై ఓవర్‌పై రాకపోకల పునరుద్ధరణ

పెనుగొండ: పెనుగొండ ఫ్లై ఓవర్‌పై రాకపోకలు శనివారం నుంచి పునరుద్ధరించనున్నట్లు ఆర్ అండ్ బీ ఏఈ టీఆర్వీ ప్రసాద్ తెలిపారు. నెలకు పైగా ఫ్లై-ఓవర్ మరమ్మతులు నిర్వహిస్తున్నారు. మరమ్మతుల కోసం రాకపోకలను నిషేధించారు. దీంతో పాటు నెగ్గిపూడి కల్వర్టు నిర్మాణం చేపట్టడంతో పూర్తిగా ఆర్టీసీ, భారీ వాహనాల రాకపోకలు నిషేధించారు. ఆర్టీసీ బస్సులు, భారీ వాహనాలు ఆచంట మీదుగానూ, ఆలమూరు మీదగాను రాకపోకలు సాగించాయి. 10 రోజుల క్రితం నెగ్గిపూడి కల్వర్టు నిర్మాణం పూర్తి కావడంతో మార్టేరు నుంచి పెనుగొండకు కార్లు, ఆటోల రాకపోకలకు అనుమతులు ఇచ్చారు. ఆర్టీసీ, లారీలకు అనుమతులు ఇవ్వలేదు. అయినా లారీలు యథావిధిగా పెనుగొండ గ్రామం మధ్య నుంచి రాకపోకలు సాగించాయి. బస్సులు మాత్రం రాకపోవడంతో కళాశాల విద్యార్థులు, పెనుగొండ ప్రజలు తీవ్ర ఇబ్బందులకు గురయ్యారు. ఈ తరుణంలో శనివారం నుంచి రాకపోకలకర అనుమతులు ఇస్తున్నట్లు ఆర్అండ్‌బీ అధికారులు ప్రకటించడంతో బస్సుల రాకపోకలు యథావిధిగా కొనసాగనున్నాయి.

## విద్యామిత్ర కిట్ల పంపిణీ


అత్తిలి ఎంపీయూపీ స్కూల్‌లో పిల్లలకు కిట్లను అందజేస్తున్న దృశ్యం

అత్తిలి: విద్యార్థులు క్రమం తప్పకుండా పాఠశాలకు హాజరై ప్రభుత్వం కల్పిస్తున్న సదుపాయాలను సద్వినియోగం చేసుకుని మంచి ఉన్నత స్థితికి చేరుకోవాలని ఎంఈవోలు ఎస్ రమేష్, ప్రసాద్‌లు అన్నారు. శుక్రవారం అత్తిలి ఎంపీయూపీ పాఠశాలలో ప్రత్యేక అవసరాలు గల పిల్లలకు సర్వేపల్లి రాధాకృష్ణన్ విద్యార్థి మిత్ర కిట్లను అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలల్లో నిష్ణాతులైన ఉపాధ్యాయులు ఉన్నారని, తల్లిదండ్రులు తమపిల్లలను ప్రభుత్వ పాఠశాలల్లో చేరిపించాలని కోరారు. పాఠశాల హెచ్ఎం డీఎల్ సుజాత మాట్లాడుతూ ప్రత్యేక అవసరాలు గల పిల్లలకు ప్రభుత్వ పరంగా వివిధ అలవెన్సులు ఇస్తారని, వాటిని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. భవిత స్కూల్‌లో జరిగే ప్రతి కార్యక్రమానికి ప్రత్యేక అవసరాలు గల పిల్లల తల్లిదండ్రులు పాల్గొనాలని చెప్పారు. ఈ కార్యక్రమంలో ప్రత్యేక ఉపాధ్యాయులు కె రమ్య, జె ఏసురాజు, తదితరులు పాల్గొన్నారు.

## ఉమర్ ఆలీషా ట్రస్టు సేవలు మరువరానివి


మొక్కలు పంపిణీ చేస్తున్న ఉమర్ అలీషా ట్రస్టు పీఠం సభ్యులు, ప్రజాప్రతినిధులు

అత్తిలి: శ్రీవిశ్వవిజ్ఞాన విద్య ఆధ్యాత్మిక పీఠం ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న ఉమర్ ఆలీషా రూరల్ డెవలప్‌మెంట్ ట్రస్టు ద్వారా చేపడుతున్న సామాజిక సేవా కార్యక్రమాలు ప్రజలకు ఎంతగానో ఉపయోగపడుతున్నాయని సర్పంచ్ కసిరెడ్డి బాలలక్ష్మీనారాయణ అన్నారు. శ్రీ విశ్వవిజ్ఞాన విద్య ఆధ్యాత్మిక పీఠం పిఠాపురం వారి నేతృత్వంలో పీఠాధిపతి డాక్టర్ ఉమర్ అలీషా ఆశీస్సులతో ఉమర్ అలీషా రూరల్ డెవలప్‌మెంట్ ట్రస్ట్ స్థాపించి 25 సంవత్సరాలు పూర్తి చేసుకున్న సందర్భంగా రజితోత్సవ వేడుకలను శుక్రవారం అత్తిలి మండలం బల్లిపాడు ఆశ్రమ ప్రాంగణంలో ఘనంగా నిర్వహించారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన సర్పంచ్ మాట్లాడుతూ పర్యావరణ పరిరక్షణ మనందరి బాధ్యత అని, ప్రతీ ఒక్కరూ మూడు మొక్కలు నాటి వాటిని సంరక్షించాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఎంపీటీసీ సభ్యుడు ప్రగడ నాగేశ్వరరావు, ఉభయగోదావరి జిల్లాల కన్వీనర్ గారైన అడబాల నాగ వెంకటరత్నం గ్రామ ప్రముఖులు గారపాటి ధర్మయ్య,ఆకుల నాగేశ్వరరావు, గారపాటి నాగేశ్వరరావు పాల్గొన్నారు.

## విలీన సభను జయప్రదం చేయండి


కరపత్రాలు విడుదల చేస్తున్న ఓబీసీ నాయకులు

తాడేపల్లిగూడెం (టీఓసీ): విజయవాడలో ఈ నెల 30వ తేదీ సోమవారం నిర్వహించే ఓబీసీ సంఘాల విలీన సభను జయప్రదం చేయాలని యూనియన్ జిల్లా నాయకులు మామిడి దాన వర ప్రసాద్ పిలుపునిచ్చారు. స్థానిక శేష మహల్ సెంటర్‌లో శుక్రవారం జరిగిన సమావేశంలో ఉమ్మడి సంఘాల ఆధ్వర్యంలో కరపత్రాలను విడుదల చేశారు. దాన వర ప్రసాద్ మాట్లాడుతూ ఏపీ ప్రగతిశీల భవన ఇతర నిర్మాణ కార్మిక సంఘం, ఆదర్శ భవన నిర్మాణ కార్మిక సంఘం రెండు సంఘాలు విజయవాడలో విలీనం అయ్యేందుకు నిర్ణయించినట్లు చెప్పారు. ఈ సందర్భంగా జరిగే సదస్సుకు పెద్ద సంఖ్యలో కార్మిక నాయకులు, కార్మికులు హాజరు కావాలని పిలుపునిచ్చారు. సంఘాలు బలోపేతం కావడంతో పాటు మరింత చురుకుగా పనిచేస్తామని చెప్పారు. కూటమి ప్రభుత్వం వచ్చి సంవత్సరం కావస్తున్నా నేటికి వారు ఇచ్చిన హామీలు అమలు చేయలేదని విమర్శించారు. కార్మికులను ప్రభుత్వం అన్ని రకాలుగా ఆదుకోవాలని కోరారు. లేని పక్షంలో సమరశీల పోరాటాలకు సిద్ధమని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో బి.ఉదయరాజు, ప్రసాద్‌కుమార్, అసిఫ్ భాషా, సయ్యద్ భాషా, రాము, సత్యనారాయణ, మోహన్ పాల్గొన్నారు.

## దివ్యాంగులకు చేయూత ఇవ్వాలి

ఇరగవరం: దివ్యాంగులకు సమాజంలో ప్రతి ఒక్కరూ చేయూత ఇవ్వాలని ఇరగవరం ప్రభుత్వ పాఠశాల ప్రధానోపాధ్యాయుడు కడలి సత్యనారాయణ తెలిపారు. మండలంలోని స్థానిక భవిత కేంద్రంలో శుక్రవారం హెలెన్ కెల్లర్ డే (జూన్ 27)ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా సత్యనారాయణ మాట్లాడుతూ దివ్యాంగుల సంక్షేమానికి అందరూ కలిసి రావాలన్నారు. హెలెన్ కెల్లర్ జీవితం, ఆమె సాధించిన విజయాలు, దివ్యాంగుల హక్కుల కోసం ఆమె చేసిన కృషిని వివరించారు. దివ్యాంగ పిల్లలకు నాణ్యమైన విద్యను అందిస్తూ, వారిని స్వావలంబన దిశగా ప్రోత్సహిస్తోందని చెప్పారు. దివ్యాంగుల సంక్షేమానికి ప్రభుత్వం అమలు చేస్తోన్న పథకాలను వివరించారు.